# శిక్ష

**ఇచ్ఛాపురపు రామచంద్రం**

"డాక్టర్! మా అమ్మ నెలాగైనా బ్రతికించండి. ప్లీజ్. ఎంత ఖర్చయినా సరే- కావాలంటే నా రక్తం అంతా తీసుకోండి. మా అమ్మని మాత్రం బ్రతికించండి. నా ప్రాణం తీసేసుకోండి. ఫరవా లేదు. కాని మా అమ్మ బతకాలి డాక్టర్." అతని కళ్ళల్లోంచి నీళ్ళు కారుతున్నాయి. ముఖంలో భయమూ, ఆందోళనా, ఆత్రతా.

"మీ పేరు?"

"మురళి."

"ఏం చేస్తూంటారు?"

"ఎలక్ట్రానిక్స్‌లో ఇంజనీర్‌ని."

"చాలా చిన్న వయసులోనే మంచి ఉద్యోగం సంపాదించారు." అభినందిస్తు న్నట్లున్నాడు డాక్టరు.

"అదంతా మా అమ్మ చలవ. అమ్మే నాకు ఎలక్ట్రానిక్స్ రంగం సూచించింది."

"మీ వయసు - పాతిక అనుకుంటాను."

"ఇరవై నాలుగు."

"ఈ వయసులో మీ వంటి యువకులు సాధారణంగా రొమాంటిక్‌గా ఆలోచిస్తూంటారు. అలాగే ప్రవర్తిస్తారు. లవ్... రొమాన్స్... అమ్మాయిలు..."

ఆయన ఉద్దేశం అర్థమై నట్లనిపించింది మురళికి.

"ఇంతవరకూ నే నెవరినీ ప్రేమించ లేదు - అమ్మని తప్ప. అమ్మ ఏం చెప్పేది? పెళ్ళయ్యాక భార్యని ప్రేమించు. అదే న్యాయం, సుఖమూ కూడా అని. డాక్టర్! మా అమ్మ.." దీనంగా ఉం దతని కంఠం.

డాక్టరు అతని వైపు జాలిగా చూశాడు. మురళి - పాతికేళ్ళు రాబోతున్నా పట్టి అమ్మ కూచిలా ఉన్నాడు. అమ్మ తప్ప వేరే ప్రపంచం తెలిసినట్లు లేదు. ఇంకా అమ్మ కొంగు వదలని ఈ పాతికేళ్ళ పసివాడు - రేపెలా బతుకుతాడో పాపం! ఏ దైమైనా మురళి చిత్రమైన వాడు. ఈ రోజుల్లో పదిహేనే ళ్ళయినా రాకుండానే ప్రేమలో పడుతూ తల్లిదండ్రులని మరచిపోతున్న కుర్రాళ్ళ మధ్య - పాతిక వస్తున్నా అమ్మ ఒడి వదలనంటున్న మురళికి మానసికంగా లోపమేదీ లేదు కద? ఛీ అమ్మని ప్రేమించడం మానసిక లోప మెందు కౌతుంది?

"చూడండి మురళీ! మీరు చదువుకున్న వారు. ఇలా బేలగా మాట్లాడడం మీకు తగదు. డాక్టరు కూడా మనిషే. అతని హద్దు లతని కుంటాయి. మీ అమ్మ గారిని కాపాడడానికి శాయశక్తులా ప్రయత్నిస్తున్నాం. మా లోపం ఏమీ లేకుండా కృషి చేస్తున్నాం. ఐతే - భవిష్యత్తు ఎవరు చెప్పగలరు? ఆశించడం మేరకే మనిషి వంతు. మానవ యత్నం చేయడమే అతని వంతు. ఆ పైన భగవంతుడే నిర్ణయించాలి. మీరూ వినే ఉంటారు. శాస్త్రం ఆగిపోయిన చోట భగవంతుడు మొదలవుతాడని. మురళీ! మీరు వెళ్ళి మీ అమ్మ గారిని చూడండి."

మనసు వికలం కాగా ఆత్రంగా తల్లి వద్దకు నడిచాడు మురళి.

ఆ గదిలో ఒకే ఒక్క బెడ్. దాని మీద - కళ్ళు మూసుకుని - అమ్మ.

"అమ్మా!"

"మురళీ, వచ్చావా?" నీరసంగా పలకరించిం దావిడ ఆప్యాయత నిండిన కంఠంతో.

"బాధ ఎక్కువగా ఉందా అమ్మా?" ఆమె చేతిని తన చేతిలోకి తీసుకున్నాడు.

"శారీరకమైన బాధ కాదు నాయనా!"

"మరి?" ఆశ్చర్యంగా చూశాడు. అమ్మకి మానసిక మయిన సమస్యలా? ఏమిటవి? అమ్మకి తనూ, తనకి అమ్మ అంతేగా. తన గురించి ఆమె కే చింత లేదని ఆవిడే పదే పదే అనేది. 'చక్కగా చదువుకున్నావు. మంచి ఉద్యోగం చేస్తున్నావు. నిన్ను చూస్తే నా కెంతో గర్వంగా ఉంటుందిరా కన్నా. ఎంతో ముచ్చటేస్తుంది బాబూ. ఏ తల్లికి పట్టే నింత అదృష్టం? నేను పూర్వ జన్మలో చాలా పుణ్యం చేసుకున్నాను నాన్నా!' అనేది తరుచుగా. ఆర్థిక సమస్యలు లేవు. త నెన్నడూ అమ్మ మాట జవదాట లేదు. మరి?

"మనసు దొలి చేస్తూంది నేను చేసిన పాపం.."

నివ్వెర పోయా డతను. "అమ్మా! నువ్వు పాపం చెయ్యడమా?" నమ్మ లేనట్లు చూశా డతను. ఎంతో మంచిదైన అమ్మ పాపం చేయగలదా?

"ఇన్నాళ్ళూ ఇది గుండెలో దాచుకుంటూ రాగలిగాను. కాని ఇక నా వల్ల కాదు. నే నింక బ్రతికితే కొన్ని గంటలు. రెండో మూడో గంటలు. అంతే. చచ్చిపోయే ముందైనా నేను చేసిన నేరం చెప్పెయ్యక పోతే ప్రశాంతమైన మరణం లభించదు. బాబూ! గుండె దిటవు చేసుకో. ఆవేశ పడకుండా - నేను చెప్పబోయేది జాగ్రత్తగా విను. ఆ పైన - నన్ను క్షమిస్తావో, శపిస్తావో..."

"అమ్మా, నేను నిన్ను క్షమించడమా? నా తరం కాదమ్మా. నాకు చేతనైనది నిన్ను ప్రేమించడం మాత్రమే."

"కాని.. నేను చేసినది క్షమించ రాని నేరమే ఏమో బాబూ..." అంటూ ఆమె ఒక్కసారి కనులు మూసుకుంది.

* * * * * *

కోటప్ప తిరునాళ్ళు.

ఆ దంపతులు చాలా ప్రభలను చూశారు. దేముడి దర్శనం చేసుకునారు. కొండ దిగడానికి ఉపక్రమించారు.

"ఏం కోరుకున్నావు!" అడిగాడు భర్త.

"మీకు తెలియని దేముంది? సంతాన మిమ్మని వేడుకున్నాను దేముణ్ని. కనీసం ఒక్క కొడుకు నైనా ప్రసాదించమని ప్రార్థించాను."

"అదుగో! అటు చూడు."

అక్కడ నాలుగైదేళ్ళ కుర్రాడు. ఒంటరిగా దారి తప్పినట్లు... తల్లి దండ్రుల నుంచి తప్పి పోయినట్లు.. అడవిలో ఒంటరి దయిన లేగ దూడలా.. బిక్క మొహం వేసుకుని బిక్కు బిక్కు మంటూ ఆ జనంలో.

చటుక్కున పరుగెత్తిం దామె అటు. ఆ అబ్బాయిని చేయి పట్టుకుని దగ్గరకు తీసుకుంది.

"ఎవరు బాబూ నువ్వు?"

అబ్బాయేమీ అనలేదు. బిత్తర పోతూ చూశాడు.

"చిన్న పిల్లడు. ఏం చెప్పగలడు? బాబూ, నీ పేరేమిటి?" అడిగాడు ఆయన.

"ములలీ."

"మీ అమ్మా నాన్నగారూ ఏరీ?"

"ఏమో."

అతని కర్థమై పోయింది- ఈ కుర్రాడి పేరు మురళి. తప్పిపోయాడు.

"మనతో తీసుకెళ్ళి పోదాం. ఈ జనంలో ఇతని తల్లిదండ్రు లెవరో కనుక్కోలేము. అబ్బాయి ముద్దుగా ఉన్నాడు. చక్కగా ఉన్నాడు. అఁ.. దేముడిచ్చాడు మన కితన్ని. మన మొరాలకించి వరం అనుగ్రహించాడు. మురళి మనకి వరప్రసాదుడు" అంటూ మురళి నెత్తుకుని ముద్దులు పెట్టేసుకుం దావిడ. మిఠాయిలు తినిపించి ఆకలి తీర్చి, నీళ్ళు పట్టి మాలిమి చేసుకుంది కొంచెం సేపటిలోనే

"మాతో వచ్చేస్తావా మురళీ?"

"ఓ!" కళ్ళు తిప్పుతూ చెప్పాడు.

"రైలెక్కుదాం.. నీకు బిస్కట్లు, బిళ్ళలూ, బొమ్మలూ - ఎన్నో కొంటాను. నాతో ఉండి పోతావా?"

"ఊఁ."

"వద్దు శారదా! అనవసరపు ఆశలు పెట్టుకోకు. ఇతను ఎవ రబ్బాయో? ఎంక్వయిరీలో అప్పగిం చేద్దాం. వాళ్ళ తల్లిదండ్రులు వొచ్చి తీసుకు వెళ్తారు."

"ఊహుఁ ఈ పిల్లవాణ్ణి నే నివ్వను. మురళి ఎవరి పిల్ల వాడూ కాడు. దేముడు నా కోసం- మన కోసం ప్రసాదించిన వరం. అందుకే - చూడండి ఎంత ముద్దొస్తున్నాడో. ఎవరి పిల్లడో ఐతే ఈ పాటికే మైకులో పదిసార్లు చెప్పి ఉండేవారు- పిల్లవాడు తప్పిపోయాడని. ఒక్కసారయినా చెప్ప లేదంటే ... ఏమి టర్థం?"

ఆయన ఇంకేమీ అనలేక పోయా డామెను. పిల్లల కోసం ఆమె తపించి పోతూందని ఆయనకి తెలును. ఆ తపన కొద్దీ మాత్రమే ఇలా అనుచితంగా ప్రవర్తిస్తూంది. పరుల సొమ్ము నాశిస్తూంది. హృదయం ఒడ్డుల నొరిసి పారుతూ - పొంగిపోతున్న మాతృప్రేమకు ఆలంబన మంటూ లభించక పోతే ఆమె ఏమైపోతుందో? కాని ఇది కూడా ఒక విధంగా దొంగతనమే ఔతుందేమో!

"మురళీ!" పిలిచారు.

తన చక్కని కన్నులతో - అటు చూశాడు చిన్నారి మురళి.

"నీకు అమ్మా, నాన్నా ఉన్నారా?"

ఏం జవాబు చెబుతాడో అని ఆత్రంగా చూస్తూంది ఆమె పిల్లవాడి వంక. మురళీ కాని ఉన్నారంటే - ఆయన ఏం చేస్తారో తనకి తెలును.

మురళీ ఏమీ అన లేదు. జవాబు చెప్పకుండా ఎటో చూస్తూ ఉండిపోయాడు.

ఆమె సంతోషాని కవధి లేదు. "లేరండీ. మురళి కెవరూ లేరు. ఉంటే చెప్పేవాడే. లేని

వాళ్ళ గురించి ఏం చెప్పగలడు ? ఇంక సందేహం లేదు. మురళి మనకి దేవు డిచ్చిన బిడ్డే. పదండి స్టేషన్‌కి పోదాం. రైలుకి టైమై పోతూంది" అంటూ మురళిని ఎత్తుకుంది.

ఎంత త్వరగా అక్కడి నుంచి వెళ్ళిపోతే అంత నిశ్చయంగా మురళి తనకి దక్కుతా డనిపిస్తూం దామెకు. అందుకే ఆ తొందర. ఆ పరిసరాలలో ఉంటే ఎవరు వచ్చి మురళి తమ కొడు కంటారో అని ఆమె భయం.

ఇల్లు చేరిన పది రోజుల వరకూ ఏమీ జరగలేదు. ఆమె మురళిని క్షణం వదల లేదు. వాడి కెన్ని ఆట వస్తువులు కొన్నదో లెక్క లేదు. ఎన్ని ముద్దులు పెట్టుకుందో లెక్క లేదు. వాడితోనే లోకమైపోయిం దామెకి.

ఆ వేళ ఆమె భర్త న్యూస్ పేపరు పట్టుకుని వచ్చా డామె దగ్గరికి.

"ఇది చూడు" అంటూ పేపరులోని ఒక బాక్స్ ఐటమ్ చూపాడు.

అక్కడ - మురళి ఫోటో ఉంది 'తప్పిపోయాడు' అన్న పెద్ద అక్షరాల కింద "కోటప్ప తిరునాళ్ళలో మా అబ్బాయి తప్పిపోయాడు. పేరు మురళి. సరిగా మాటలు రావు. పేరు మాత్రం చెప్పగలడు. దొరికిన వారు ఈ దిగువ అడ్రసుకి అందజేయ ప్రార్థన. అతని తల్లి నైన నేను మురళి కోసం బెంగ పెట్టుకుని ఉన్నాను. వింజమూరి శారద, నెలవంక. గ్రామం, విశాఖ జిల్లా.౦౦

చదివి - వణికి పోయిం దామె. ఎవరో ఎత్తుకుపోతా రేమో అని భయపడుతున్నట్లు మురళీని గట్టిగా కౌగిలించుకుని-

"మురళీని నే నెవరికీ ఇవ్వను. మురళీ నా కొడుకు. నాకు దేము డిచ్చాడు" అంటూ ఏడవ సాగింది.

"అది కాదు.." అత నేదో చెప్పబోయాడు.

ఆమె వినిపించు కోలేదు. "మురళి నా కెంతో అలవాటై పోయాడు. వీడు నా ప్రాణం. నా జీవితం. నేను వీడిని వదిలి ఉండ లేను."


"కాని.. ఆవిడ... మురళి తల్లి."

"మురళీని తీసుకు పోవాలను కుంటే ముందు నన్ను చంపి మాత్రమే తీసుకెళ్ళగలరు. నా కంఠంలో ప్రాణ ముండగా నేను నా కొడుకు నివ్వను." ఆమె పిచ్చిదే ఐపోయింది మురళిని వదులు కోవాలంటే.

ఆయన ఇంకేమీ అనలేక పోయాడు. ఏమీ చేయలేని అసహాయస్థితి. తన భార్య మురళి నెంత ప్రేమిస్తూందో కళ్ళారా చూస్తున్నాడు. మురళిని దూరం చేస్తే ఆమె నిజంగానే చచ్చి పోతుందేమో అని భయ మేసింది. అందుకే ఏమీ చేయకుండా ఊరుకున్నాడు.

మురళి ఆమె కొడుకై పోయాడు.

ఆమె ఆనందాని కవధులు లేవు. కొంత కాలం తరువాత భర్త చనిపోయాడు. ఆమె మురళిని



చూసుకుంటూ బతికింది. మురళే ఆమె సర్వస్వమూ. అతన్ని చక్కగా చదివించింది. ఏ లోటూ లేకుండా పెంచి పెద్ద చేసింది."

"ఔను. నే నెంత ముద్దుగా ... చక్కగా పెరిగానని !"

"కన్న తల్లి నుంచు దూరం చేసిన నన్ను క్షమించగలవా మురళీ?" ఆవిడ కళ్ళ నిండా నీళ్ళు.

"అవేం మాటలమ్మా. నేను నిన్ను క్షమించడ మేమిటి? నీ ఋణం తీర్చుకోడం నా తరం కాదు. అమ్మా! నువ్వు లేనిదే నేను బతక లేనమ్మా" మురళి కంఠం రుద్ధ మయింది.

ఆమె ఏమీ అనకుండా మౌనంగా ఉండిపోయింది.

"నీ ప్రేమ లేనిదే నేను బతక లేనమ్మా. అమ్మా! నువ్వు మరణించడానికి వీల్లేదమ్మా."

"జాతస్య హి మరణం ధ్రువం. చావు పుట్టుకలు మన చేతిలో ఉండవు కదా బాబూ.."

"నువ్వు లేకుండా బతకడం ఊహించుకుంటేనే భయమేస్తూందమ్మా.. అమ్మ లేని బతుకు.."

"నీకు అమ్మ ఉంది కదా నాన్నా. పెంచిన తల్లి కంటే ఘనమైన అమ్మ. కన్న తల్లి. నా పెట్లో ఆ నాటి పేపరు కటింగుంది బాబూ. దానిలో నిన్ను కన్న తల్లి అడ్రసుంది. ఆమె దగ్గరకు వెళ్ళి జరిగినది చెప్పి ఈ పాపాత్మురాలిని క్షమించమను. మాతృత్వ ప్రలోభం కొద్దీ అంత ఘోరాని కొడిగట్టాననీ, కొడుకుని దూరం చేసినందుకు నన్ను మన్నించమని ప్రార్థించాననీ చెప్పు" అంటూ ఆమె కన్ను మూసింది.

"అమ్మా!" అంటూ అరిచాడు మురళి - గుండె లవిసేలా.

డాక్టరూ, నర్సులూ పరుగెత్తుకు వొచ్చారు. డాక్ట రామెని పరీక్షించి - "చనిపోయింది" అని చెప్పేశాడు.

* * * * * *

జంక్షనులో బస్ ఆగింది. మురళి దిగాడు. అక్కడ దిగినది అత నొక్కడే. అతను దిగడ మేమిటి, బస్సు వెళ్ళిపోయింది.

"ఎక్కడికి వెళ్ళాలి బాబూ? మన దే ఊరు?" అడిగా డొక పల్లెవాసి దిక్కులు చూస్తూ నిలబడిన మురళిని.

"మాది విజయవాడ.. నెలవంక వెళ్ళాలి."

"నెలవంకా! కోసెడు దూరం. అదుగో ఆ బండి తోవంటే వెడితే వొస్తుంది. పట్నవాసం వారు - ఎలా వెళ్తారో ఏమో. బండయినా లేదు."

"నేను నడవగలను తాతా!"

"ఊరి మొదటే శ్మశానం. జడుసు కోకండేం?"

"నా కలాటి భయాలు లేవులే." నవ్వాడు మురళి.

"వెళ్ళిరండి."

కదిలాడు మురళి. ఆ తాతతో మాట్లాడుతూంటే ఎంతో హాయిగా ఉంది, ఆత్మీయులతో కబుర్లు చెబుతున్నట్లు!

ఎండ బాగానే కాస్తూంది. అయినా వేడి ఎక్కువగా లేదు. తోవ కటూ ఇటూ చేలు. గట్ల మీద పచ్చగా చెట్లు. అవి చల్లని గాలి నిస్తున్నాయి.

మురళి మెల్లగా నడుస్తున్నాడు.

మనసులో ఆలోచనలు.

అమ్మ - తనని కన్న తల్లి గురించి ఎంతగానో చెప్పింది. కన్నతల్లి దేవతేనట. ఆమె హృదయం నిండా అమృత మేనట. బిడ్డల మీద ఎంతో వాత్సల్యం కురిపిస్తుందట. తనని చూసి చిన్న వయసులోనే ప్రయోజకు డైనందుకు పొంగి పోతుందట. తన కన్నతల్లి ఎలా ఉంటుందో? అమ్మలాగే ఉంటుందా? తను చెప్పేది విని తనామె కన్న కొడుకని తెలిసి ఎంత ఆనందిస్తుందో?

ఆలోచనలలోనే అతను చాలా దూరం వచ్చేశాడు. అప్పు డీ లోకంలోకి వచ్చి చూశాడు.

కొంచెం దూరంలో ఊరు. అదే నెలవంక గ్రామమేమో. నెలవంక. తన కన్న తల్లి ఉండే ఊరు. ఆమె ఎలా ఉందో?

అతను తుళ్ళిపడ్డాడు.

ఏడుపులు.... ఆక్రందనలు. ఎదురుగా శవం! నలుగురు మనుషులు మోసుకు వస్తున్నారు. వెనుక కొంత మంది. ముందు - శవానికి దారి చూపుతున్నట్లు - నిప్పుల కుంట పట్టుకుని ఒకరు నడుస్తున్నారు.

మురళికి జాలి వేసింది. ఎవరో పాపం!

అతను ఆగిపోయాడు. ఎందుకో అతని కా శవాన్ని చూడా లనిపించింది. కాని. శవం ముఖం కనపడ లేదు. పువ్వులా అవీ కప్పేశాయి.

"ఎవరయ్యా నువ్వు?" శవం వెనుక మనుషులలో ఒకరు ఆగి అడిగారు.

"నా పేరు మురళి. విజయవాడ నుంచి వస్తున్నాను, పని ఉండి. చనిపోయిన దెవరూ?"

"ఒక యువకుడు. పాతికేళ్ళు కూడా లేవు. పట్నంలో ఉద్యోగం చేస్తున్నాడు. తల్లిని చూడాలని పల్లెకి వచ్చి పాము కాటుకి చచ్చిపోయాడు, రాత్రే. ఆ తల్లికి తనొక్కడే. ఆవిడ దుఃఖం ఏం చెప్పమంటావు!" జాలిగా అన్నా డతను. ఆ కంఠంలోని కరుణకి మురళి మనసు కరిగి పోయింది.

అలవాట్లు త్వరగా అంతం కావు పల్లెవాసులకి - కొత్త మనిషి కనిపిస్తే ఎవరో, ఏం పని మీద వొచ్చారో తెలుసు కోనిదే తోచదు. అలాగే తమ దగ్గరేదైనా కబురు ఉంటే చెప్పకుండానూ తోచదు. ఆ అలవాటు కొద్దీ - చివరికి శవం వెనుక వెళ్తున్నా అతను మురళితో అన్ని మాటలాడాడు.

చనిపోయిన యువకుడి మీదా, అతని తల్లి మీద జాలిపడుతూ - ముందుకి కదిలాడు మురళి.

ఊరిలోకి వచ్చాడు. రావి చెట్టు. దాని మొదలు చుట్టూ విశాలమయిన గుండ్రని అరుగు. తను పల్లెటూరు గురించి చదివినవి జ్ఞాపకం వచ్చి - ఓహో! దీన్నే కాబోలు రచ్చబండ అంటా రనుకున్నాడు. రావి చెట్టు చాలా పెద్దదిగా పెరిగింది. దాని అకులు ఎంత చిన్న గాలి రివటకయినా రెప రెపలాడుతున్నాయి. రచ్చబండ ఎండలో కూడా చల్లగా ఉంది. గచ్చు మీద ఎవరో ఇద్దరు కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నారు. అతను వారి దగ్గరకు వెళ్ళాడు.

"నా పేరు మురళి. విజయవాడ నుంచి వస్తున్నాను." అన్నాడు.

"ఓహో! ఎవరింటికి" అడిగా రిద్దరిలోనూ వొకరు.

"శారదమ్మ గారింటికి."

ఇద్దరిలోనూ కొంచెం వయసు మీరిన అతను ఆశ్చర్యంగా చూశాడు మురళి వైపు.

"ఏ శారదమ్మగారు?"

ఇటువంటి ప్రశ్న ఎదురౌతుం దనుకోలేదు మురళి. ఒక్క నిముషం - అతని కేం చెప్పాలో తోచలేదు. అప్పుడు మెల్లగా ... "శారదమ్మ.. వింజమూరి శారద" అన్నాడు తడుముకుంటూ.

వాళ్ళిద్దరూ ఒకరి ముఖం ఒకరు చూసుకుంటున్నారు. "మీ రెవరు? మీకు శారద మ్మే మౌతుంది?"

"నే నావిడ కొడుకని-"

"మీ రెప్పుడూ ఇక్కడికి - మీ అమ్మ దగ్గరకు - వచ్చినట్లు లేదే!"

"నిజమే. ఆవిడ మా అమ్మ అని ఈ మధ్యనే తెలిసింది."

"అదేమిటి? తల్లిని తెలియని కొడుకు లుంటారా?"

"నేను దురదృష్టవంతుణ్ణి. అక్కడ నేను తప్పిపోయాను. న న్నొక్క అమృతమయి పెంచి పెద్ద చేసింది. నేను తప్పిపోయాక అమ్మ పేపర్లో ప్రకటన ఇచ్చింది కూడా చూడండి" అంటూ బాగ్ లోంచి పేపరు కటింగ్ తీసి అందించాడు.


దాన్ని చూసి.. "మాకు చదువు రాదు. అయినా మీరు చెప్పినదాన్ని బట్టే తెలిసిపోయింది" అంటూ పక్క నున్న అతని వైపు తిరిగి- "పిచ్చి శారదమ్మ కొడుకు" అన్నాడు.

తుళ్ళిపడ్డాడు మురళి. పిచ్చి శారదమ్మ!

"ఆ! మా అమ్మ పిచ్చిదా?" భరించ లేనట్లు అరిచాడు.

"మొదటి నుంచీ పిచ్చిది కాదు. నువ్వు తప్పిపోయావుగా, అప్పటి నుంచే పిచ్చెక్కి పోయింది. కొన్నాళ్ళ వరకూ నువ్వు దొరుకుతావేమో, తిరిగి వస్తావేమో అని చూసింది. ఎంతకీ నువ్వు దొరక్క పోయేసరికి - మతి చెడింది."

"అయ్యో! అమ్మ పిచ్చిదై పోయిందా నా కోసం?" ఏడుపొచ్చింది అతనికి.



"పోనీండి.. మా అమ్మ పిచ్చిదైతే కానీండి. నాకు మా అమ్మని చూపించండి" అంటూ దీనంగా అడి • గాడతను వారిని కన్నీరు తుడుచుకుంటూ.

ఏం చెప్పడమా అన్నట్లు సందిగ్ధంలో పడ్డట్లు వాళ్ళు ఒక నిముషం మౌనంగా ఉండిపోయారు.

మురళి కేమీ అర్థం కాలేదు.

"దయచేసి నన్ను మా అమ్మ దగ్గరికి తీసుకెళ్ళండి. నాకు మా అమ్మని చూపించండి. మీరు చూపిస్తే కాని నేను మా అమ్మని తెలుసుకోలేను."

"ఇం కెక్కడి శారదమ్మ?" నిట్టూర్చాడు అతను.

మురళి కేమీ అర్థం కాలేదు. "అంటే? ఏమిటి మీ రనేది?"

"పిచ్చి శారదమ్మ బతికి నన్నాళ్ళూ కొడుకో కొడుకో అంటూ కొడుకు గురించి కలవరిస్తూ - ఆరు నెలల కిందటే చచ్చిపోయింది" అంటూ చావు కబురు చల్లగా చెప్పా డతను.

"ఆ! అమ్మ చనిపోయిందా? అయ్యో. అమ్మా.." దుఃఖం పట్టలేక పోయాడు మురళి.

రెండు చేతులతోనూ ముఖం కప్పుకుని. "అమ్మా అమ్మా" అంటూ ఏడుస్తూ అక్కడే కూలబడి పోయాడు.

"ఏడవకు బాబూ! ఎంత ఏడిస్తే మాత్రం పోయిన వాళ్ళు తిరిగి వస్తారా?"

"నా పరిస్థితి మీకు పూర్తిగా తెలియదు. నా కున్నది ఒకే ఒక్క అమ్మ మాత్రమే. ఆమె నన్ను పెంచిన తల్లి. ఆ తల్లి మరణిస్తూ - ఓదార్పుగా నన్ను కన్న తల్లి గురించి చెప్పింది. ఆమెను

## మెదడు ముచ్చట

'సర్వాని అంగాని శిర: ప్రధానం' అన్నారు. అంటే శరీర అంగా లన్నింటిలోకీ శిరస్సు ప్రధానం అన్న మాట. దేహంలో ఒక చిన్న భాగమైన శిరస్సుకి ఈ ప్రాముఖ్యం ఎందుకు వచ్చిందంటే అందులోనే సకల జ్ఞానేంద్రియాలూ, దేశం మొత్తాన్ని నడిపించే మెదడూ ఉన్నాయి కనుక. నిజానికి మెదడు బరువు శరీరం బరువులో పదిహేనవ వంతు మాత్రమే. అయినా అంత పెద్ద దేహాన్ని నడపాలి కనుక, శరీరం మొత్తం కోసం వినియోగం అయ్యే ఆక్సిజన్‌లో అయిదవ వంతుని తానే వాడుకుంటుంది. అలాగే శరీరం ఖర్చు చేసే కేలరీల ఉష్ణశక్తిలో కూడా అయిదు వంతులు ఖర్చు చేస్తుంది.

-కె. ఆర్. కె. మోహన్

చేరుకుందామని ఆత్రంగా వచ్చిన నాకు - ఇక్కడా దురదృష్టమే ఎదురైంది. ఈ ప్రపంచంలో నేను ఏకాకిని. అనాథను." గుండె లవిసేలా విలపించాడు మురళి.

"ఏదయినా మన భావనలోనే ఉంటుంది బాబూ. చదువుకున్న మీకు - నేను చెప్పేపాటి వాడిని కాను. కాని సుఖమైనా, దుఃఖమైనా, సంతోషమైనా, విచారమైనా, కరుణైనా, కఠినత్వమైనా, మమతైనా, మరొకటైనా అన్నీ మన మనసులోనే మనం అనుకునే తీరులోనే ఉంటాయి. ఇంత ప్రపంచ ముంది. ఇందరు మనుషు లున్నారు. వాళ్ళూ మనలాటి మనుషులే. అనుకోగలగాలే కాని వాళ్ళందరూ మన మనుషులు కారూ? అందరమూ ఒకటే కాదూ? భావించు కోగలగాలే కాని అందరూ అందరికీ బంధువులే, ఆత్మీయులే, ఆప్తులే, అయినవారే. కాదంటావా?"

అతని మాటల్లో జీవన సత్యం గోచరించింది మురళికి. ఎంత విలువైన మాట చెప్పాడు. తన పరిస్థితి చక్కగా సరిపోయే, తనకి దారి చూపే అద్భుతమైన సూచన.

"మీరు చెప్పినది పరమ సత్యమే."

"ఐతే ఇక నువ్వు ఏకాకి వెందు కౌతావు?"

"నిజమే. నేను ఎవరూ లేని ఏకాకిని కాను." అంటూ - ఒక నిర్ణయానికి వచ్చినట్లు లేచాడు. "మీ మేలు జన్మలో మరచి పోలేను. నా కుశల విప్పించండి. ఆశీర్వదించండి."

"నా ఆశీర్వచనమా?" అంటూనే ఆశీర్వదించా డాయన.

మురళి నడవసాగాడు ముందుకి. మెల్లగా మెల్లగా ఒక్కొక్క ఇల్లూ దాటుతున్నాడు.

ఆ చిన్న ఇంట్లోంచి - శోకాలు!

ఒక్క క్షణం ఆగా డతను సందేహిస్తున్నట్లు. ఇంటి లోపలికి చూశాడు. ఏభై దాటిన స్త్రీ ఏడుస్తూంది.

ముగ్గురు నలుగురు స్త్రీలు ఆమె నోదార్చుతున్నారు. "గర్భశోకం దుర్భరమే. కాని విధి నెవరు తప్పించ గలరు? ఏడిచేడిచి నీ గుండె ఆగిపోయేటట్లుంది. పోయినవాళ్ళతో పాటూ మనమూ పోగలమా? చెట్టంత కొడుకు


# DIPLOMA ADMISSION CORRESPONDENCE COURSE

The Department of Distance Education, Indiana Academy of Management Sciences, conduct SIX MONTHS DIPLOMA courses of the 'Institute of Law & Management' for graduates and Non-graduates. Admission for the following courses are open and all Diplomas are valid throughout the country. Only Limited seats available.

| For Graduates | For Non-Graduates. |
| --- | --- |
| **Post-Graduates Diplomas** | **Diplomas** |
| 1. Marketing | 1. Marketing |
| 2. Business | 2. Business |
| 3. Financial | 3. Sales Management |
| 4. Personnel & Industrial Relations. | 4. Banking |
| 5. Production | 5. Hotel Management |
| 6. Materials | 6. Advanced Accountancy |
| 7. Labour Laws | |
| 8. Administrative Law & Management | |
| 9. General Law | |
| Eligibility: Graduates | Eligibility: SSLC/PUC/PDC/HSC. |

The Examination for all the above Diplomas will be conducted through correspondence. Excellent study materials will be sent. Very low fee charged. Interested candidates may apply for 'FREE PROSPECTUS' to the Executive Director, (Diploma Admission), Indiana Academy of Management Sciences, 1083, Mettupalayam Road, Coimbatore-641 002. Tamil Nadu.



క్రాంప్టన్ గ్రీవ్స్‌లో మేం ఫేన్లను
డిజైను చేసే తీరు యిది
గొప్ప కార్లను రూపొందించే తీరు అది



సూపర్ డీలక్స్
ఈ ఫేన్‌కి అయ్యే విద్యుత్తు వినియోగం తక్కువ, వీచే గాలి ఎక్కువ. సాఫీగా, నిశ్శబ్దంగా తిరుగుతుంది. మీరు ఎంచుకోడానికి అయిదు రంగుల్లో దొరుకుతుంది.

ఎప్పుడూ తప్పని నిర్ణయం
క్రాంప్టన్ గ్రీవ్స్ ఫేన్లు

చేతికంది వచ్చిన వాడు - ఒక్కగా నొక్కడు జారిపోతే ఖేదమే. కాని ను వ్వెంత గుండె బాదుకున్నా - పోయిన కొడుకు వస్తాడా తిరిగి ?"

"వస్తాడు. వచ్చాడు."

ఆ మాటలకి - ఆవిడ చుట్టూ ఉన్న ఆడవాళ్ళు తుళ్ళిపడి ద్వారం వేపు చూశార్తు. అంతే ఆవిడ మానాన ఆవిడని వదిలేసి అక్కడి నుంచి పరుగెత్తుకు పోయారు.

ఆవిడ ఒక్కతే మిగిలి ఉంది - ఏడుస్తూ.

ఆమె వైపు నడిచాడు మురళి.

"అమ్మా!"

ఆమె రోదన ఆపలేదు.

"అమ్మా!" అంటూ ఆమె ఎదురుగా కూర్చున్నాడు.

"ఎవరు నువ్వు?" అం దామె. బహుశా - అమ్మా అన్న పిలుపు ఆమె దుఃఖాన్ని చెదరగొట్టి మాతృత్వాన్ని మేలు కొలిపిందేమో.

"ఎవరు నువ్వు?" మళ్ళీ అడిగిం దామె.

"నీ కొడుకనమ్మా."

ఆమె అతని వైపు చూసింది. "అసంభవం! నువ్వు నా కొడుకువి కావు. నా ఒక్కగా నొక్క కొడుకూ పాముకాటుకి గురయి చనిపోయాడు, నన్ను ఒంటరిదాన్ని చేసి; దౌర్భాగ్యురాలిని చేసి." అంది దుఃఖంలోనే.

మురళికి ఆమె మీద జాలి వేసింది. ఈ తల్లి - కొడుకు పోవడంతో - జీవితమే పోయినట్లు విచారిస్తోంది. తను - అమ్మ పోతే - సర్వమూ శూన్యమై పోయినట్లే బాధ పడ్డాడు. ఈ - మాతా పుత్రుల గాఢానుబంధం - ఈ దేశపు ప్రత్యేక వరమేమో. ఈ సంస్కృతి ప్రసాదించిన గొప్ప వరమేమో.

"నువ్వు దౌర్భాగ్యురాలివి కాదమ్మా" అన్నా డతను మెల్లగా.

"కొడుకు చావు చూడవలసి రావడం తల్లికీ, కొడుకు తలకి కొరివి పెట్టడం తండ్రికీ అన్నిటి కంటే దౌర్భాగ్యాలు."

"చూడమ్మా. నేను చెప్పేది కొంచెం ప్రశాంత చిత్తంతో వింటావా?"

"ఈ దురదృష్టవంతురాలితో నీ కేం మాటలు నాయనా?"

"నువ్వు నా కొక వరమివ్వా లమ్మా. నా కోరిక తీర్చాలమ్మా."

"నా దగ్గ రేముందని, ను వ్వడ గడానికీ - నే నివ్వడానికీ?"

"అత్యంత విలువైనది - మాతృ హృదయం ఉన్నదమ్మా."

"ను వ్వేమిటో మాట్లాడుతున్నావు. అసలు - ను వ్వెవరివి?"

"నాలుగో ఏట - తిరునాళ్ళలో తప్పిపోయి కన్న తల్లికి దూరమయ్యాను. ఓ అమ్మ అల్లారు ముద్దుగా పెంచి - ప్రయోజకుణ్ణి చేసింది. దురదృష్టవశాత్తూ ఆమె ఈ మధ్యనే మరణించింది. మరణించే ముందు - నన్ను కన్న తల్లి ఎవరో, ఎక్కడుంటుందో చెబితే - ఆమెని వెతుక్కుంటూ ఆత్రంగా ఇక్కడికి వచ్చాను. ఇక్కడికి వచ్చాక గుండెలు పగిలే విషయం - నన్ను కన్న తల్లి నా కోసం కలవరిస్తూ... మతి చెడి... ఈ మధ్యనే మరణించిందని - వినవలసి వచ్చింది."

"ఎవరు మీ అమ్మ?"

"శారదమ్మ గారు."

"ఆ!" తుళ్ళి పడిం దామె. "నువ్వు - శారద కొడుకువా?"

"ఒకప్పుడు."

"ఇప్పుడు?" ఆశ్చర్యంగా చూసిం దతని వేపు.

"మీ రనుగ్రహిస్తే - మీ కొడుకుని."

అతని మాటలు వినిపించుకో నట్లే.. "శారదా, నేనూ అక్క చెల్లెళ్ళలా ఉండే వాళ్ళం. కొడుకు తప్పి పోయాడని మతి చెడిపోయింది. అయినా రోజు వచ్చేది నా దగ్గరకి. ఏవేవో చెప్పేది."

"అందుకే - నేనూ మీ దగ్గరకి వచ్చాను."

"......"

"అమ్మా! నేను మీ కొడుకుగా ఉంటానమ్మా. నన్ను మీ కొడుకుగా ఉండ నివ్వండమ్మా."

"నే నెవరినీ దత్తత చేసుకునే ఉద్దేశంలో లేను నాయనా. నా కేమీ ఆస్తిపాస్తులు లేవు."

"మీరు నన్ను దత్తత చేసుకో నక్కర లేదు; నేను మీ ఆస్తిపాస్తు లాశించీ కొడుకుగా ఉంటా ననడం లేదు."

"దత్తత చేసుకోకుండా నువ్వు నాకు కొడుకు వెలా అవుతావు?"

"దత్తత ప్రమేయం దేనికమ్మా? మనసు చాలదూ? మనస్సాక్షిని మించిన దేముంది?"

"పుత్ర శోకంతో నా మనసు స్తిమితంగా లేదు. అయినా - అక్కడ - కొడుకు శవం కాలు తూంటే ఇక్కడ ఈ మాట లేమిటి?"

"ఒక విధంగా ఇదే తగిన సమయమేమో. అమ్మా! నువ్వు గర్భశోకంతో వేదన చెందుతున్నావు. కొడుకును కోల్పోయిన నువ్వూ, తల్లిని కోల్పోయిన నేనూ విచిత్రంగా ఇలా కలుసుకున్నాం. నీకు కావలసిన కొడుకుని నువ్వు నాలో చూసుకో; నాకు కావలసిన అమ్మని నేను నీలో చూసుకుంటాను. ఈ పద్ధతి మనిద్దరి సమస్యలకీ పరిష్కారం కాదూ? మన భవిష్య జీవితాలకు రాజమార్గం కాదూ?"

ఆమె నమ్మలేక పోతున్నట్టు చూస్తూంది.

"ప్రపంచం నిండా మనుషులు. మన లాంటి మనుషులు. తల్లులూ, తండ్రులూ, కొడుకులూ, పుత్రికలూ, సోదరీ సోదరులూ ... ఇంద రుండగా ఈ ప్రపంచంలో ఎవరు మాత్రం ఏకాకులు కావలసిన అగత్య మేముంద మ్మా ? అందరూ మనవాళ్ళే అనుకోగలిగితే వసుధైక కుటుంబమే కాదూ? పెంచిన తల్లినీ, కన్న తల్లినీ పోగొట్టుకున్నా కూడా నే నిప్పుడు ఒంటరినని భావించుకోడం లేదు. నువ్వు అమ్మలా అనిపిస్తూంటే - ఒంటరితనం నా మనసు ఛాయలకే రావడం లేదు."

ఆమెకి కొంచెం అర్థ మౌతున్నట్లుం దతని ఉద్దేశం. ఆమె హృదయం కొంచెం కరగ సాగింది.

"చనిపోయిన వారి గురించి విచారించడం సహజమే. మృత్యువు - మనుషుల కొక ఉన్నతమైన ప్రబోధం చేస్తుంది. మృత్యువు కేవలమూ చెడ్డది మాత్రమే కాదు."

అత నేమంటున్నాడో ఆమె కర్థం కావడం లేనట్లుంది.

"చనిపోయిన వారి కోసం విచారించడంలో - జీవించి ఉన్నవారి మధ్య నీ వారిని గుర్తించడం మరచిపోకు. హృదయాన్ని విశాలం చేసుకుని చూడాలే కాని ఈ ప్రపంచం నిండా నీకు కావలసిన వారే. నీ వారే. మానవత్వంతో, సర్వమానవ సౌహార్ద్రతతో మనసుని మలుచు కోవాలే కాని ప్రపంచ మంతా నీ కుటుంబమే. మనుషు లందరూ నీ వాళ్ళేఅని మృత్యువు చెబుతుంది. నా కలాగే తోచింది."

"బాబూ!"

"అమ్మా!"

ఒకరి పరిష్వంగ ంలో ఒకరు.

మాతాపుత్రుల తొలి కలయికలోని అద్వితీయ అనుభూతిలో మునిగి పోయా రిద్దరూ కొన్ని నిముషాల పాటు.

అప్పుడు.. "అమ్మా!"

"ఏమిటి బాబూ?"

"పదమ్మా. మనింటికి వెళ్ళిపోదాం."

"ప్రపంచమే నా ఇల్లుకదా!"

"ఎంతైనా మానవ మాత్రులం. ఒకంతట మనసుని మరల్చుకోలేము. పరిసరాలు మారితే పరితాపాలు కొంత త్వరగా శాంతిస్తాయి. తల్లి - వృద్ధాప్యంలో కొడుకు దగ్గరుండడం అన్ని విధాలా న్యాయమూ, సహజమే కదా?"

"ఊఁ." అం దామె అతని చేయ్యి పట్టుకుని.

మురళి ఆమెకు చేయూత నిచ్చి నడిపించ సాగాడు.

అలాగ వెళ్తున్న వా రిద్దరినీ చూస్తూ పల్లె తెల్లబోతూ ఉండిపోయింది. ★

